ఎల్లమ్మ దేవాలయ హుండీల లెక్కింపు



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలోని హుండీలను అధికారులు గురువారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.44,83,338 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణ తెలిపారు. వీటిలో అన్నదాన రూపంలో రూ.59,319 వచ్చినట్లు చెప్పారు. 8 యూఎస్ డాలర్స్, 5 దినార్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో చైర్మన్ సాయి బాబాగౌడ్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం



అమిత్ షా చిత్రపటాలను దహనం చేస్తున్న డీబీఎఫ్ మహిళా నాయకులు

అడ్డగుట్ట: భారత రాజ్యంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. గురువారం తుకారాంగేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర మంత్రి అమిత్ షా చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేడ్కర్ పట్ల ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామ్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ సిటీ కన్వీనర్ ఉమ, నాయకులు ఉపేందర్, ఐశ్వర్య, భవాని, శోభ, స్వప్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించేదిలేదు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిలకలగూడ: అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకైన బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించేది లేదని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై దేశ హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సీతాఫల్‌మండి చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతు హోంశాఖ మంత్రి తాను చేసిన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకుని దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు కొమురెల్లి బాబు, జోగు రాములు, రమేష్, శ్రీహరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి కృషి

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణబస్తీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. వారాసిగూడ శివాజీ విగ్రహం నుంచి బ్రాహ్మణబస్తీకి వెళ్లే మార్గంలో మురుగునీరు తరుచూ పొంగి ప్రవహిస్తోందని బస్తీవాసులు అభ్యర్థన మేరకు జలమండలి సెక్షన్ మేనేజర్ కుషాల్‌తో కలిసి గురువారం ఆయా ప్రాంతాలను సందర్శించారు. పురాతనమైన డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ శిథిలం కావడంతో సమస్య ఉత్పన్నమైనట్లు గుర్తించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సెమీ క్రిమస్ వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డబ్ మినిస్ట్రీస్ పాస్టర్ అల్లూరి సతీష్, ఆయన సతీమణి విచ్చేసి క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు.

వీసీ కార్యాలయం ఎదుట ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫీజుల పెంపు విషయంలో ప్రైవేటు వర్సిటీలతో పోటీ పడుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మండిపడ్డారు. గురువారం ఇంజినీరింగ్ పరీక్ష ఫీజును రూ.1000 పెంపును నిరసిస్తూ వీసీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నాలుగేళ్లుగా ఇబ్బడి ముబ్బడిగా ఫీజులు పెంచుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు.

ముగింపు దశకు సమగ్ర సర్వే

సమాచార సేకరణకు 'నేడు' చివరి గడువు

- మరో ఐదు రోజుల్లో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి
- జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ అధికారుల కసరత్తు



లాలాపేటలోని సికింద్రాబాద్ సర్కిల్-29 ఆన్‌లైన్ నమోదు కేంద్రం

సికింద్రాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాల సేకరణ కార్యక్రమం సికింద్రాబాద్ జోనల్ కార్యాలయ పరిధిలో ముగింపు దశకు చేరింది. జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో కొనసాగుతున్న సర్వే కార్యక్రమాన్ని ఈనెల 20తో ముగించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సమాయత్తం అవుతున్నారు. సర్వే ద్వారా వివరాల సేకరణ కార్యక్రమాన్ని ముగించడంతో పాటు, ఆ మీదట మరో రెండుమూడు రోజుల్లో సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు.

◆ ఇప్పటి వరకు సేకరించిన వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ 80 శాతం పూర్తయిందని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయ అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో ఈ సర్వే వివరాలు ప్రామాణికం కానున్నాయి.

◆ ఈ నేపథ్యంలో ఎన్యుమరేటర్లు సేకరించిన వివరాలను తప్పొప్పులకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

సంపూర్ణం కోసం ప్రత్యేక చర్యలు

సర్వేకు వెళ్లిన సందర్భాల్లో ఇండ్లకు తాళాలు వేసి ఉండడం, నిర్దేశిత చిరునామాల్లో సదరు కుటుంబ సభ్యులు లేకపోవడం, మరికొందరు వివరాలు ఇచ్చేందుకు నిరాకరించడంతో జోనల్ పరిధిలో మరో 20 శాతం కుటుంబాల వివరాలు సేకరించాల్సి ఉంది.

◆ వివరాల సేకరణ ముగింపు దశకు చేరిన నేపథ్యంలో వివరాలు అందించని కుటుంబాల వద్దకు మరోమారు ఎన్యుమరేటర్లను పంపించి తుది ప్రయత్నం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు అన్ని సర్కిల్ కార్యాలయాలకు జోనల్ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

◆ సమగ్ర కుటుంబ సర్వే వివరాల సేకరణ కార్యక్రమాన్ని సంపూర్ణం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.

90 శాతం వివరాల సేకరణ పూర్తి

జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్ల పరిధిలో 90 శాతం కుటుంబాలకు చెందిన వివరాలను ఎన్యూమరేటర్ల ద్వారా సేకరించినట్టు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రకటించారు. వీటిని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే ప్రక్రియ వేగవంతంగా జరుగుతున్నట్టు వారు తెలిపారు. సర్వే వివరాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ కోసం 300 మంది ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు.

◆ ఐదు సర్కిల్ కార్యాలయాల పరిధిలోంచి 3,28,901 గృహాల నుంచి సేకరించిన కుటుంబాల నుంచి సేకరించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ స్థితిగతులను ఆన్‌లైన్ లో పొందుపరుస్తుమని వారు పేర్కొన్నారు. వివిధ కారణాలతో జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో మరో 50 వేల గృహాల నుంచి ఆయా కుటుంబాల వివరాలను సేకరించలేకపోయినట్టు వారు స్పష్టం చేస్తున్నారు.

అధికారులు చెబుతున్నా..

సర్వే ద్వారా వివరాల సేకరణ ముగింపు దశకు చేరిందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సర్వే వివరాల సేకరణలో పలు గృహాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన వివరాల సేకరణ ప్రక్రియ పారదర్శకంగా జరుగలేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వివరాలు అందించడానికి ముందుకురాని కొన్ని కుటుంబాలను సాకుగా చూపించి చాలా ఇళ్లల్లోకి ఎన్యుమరేటర్లు వెళ్లలేదన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

◆ ఎన్యుమరేటర్లు ఇంటికివెళ్లిన సందర్భాల్లో తాళం వేసి ఉన్న గృహాల్లోకి తిరిగి వివరాల సేకరణకు వెళ్లకపోవడం, ఈ విషయంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోని ఫలితంగా కుటుంబ సర్వే వివరాల సేకరణ సమగ్రంగా జరుగలేదన్న విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా కుటుంబాల యజమానులు సహకరించిన మేరకు మాత్రమే వివరాలు సేకరించగలిగామని అధికారులు చెప్పారు.

జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలంలో సమగ్ర కుటుంబ సర్వే

సర్కిల్	సేకరించిన గృహాలు	ఆన్‌లైన్ చేసిన కుటుంబాలు
సికింద్రాబాద్	68533	56481
బేగంపేట్	39423	40653
మల్కాజిగిరి	101260	71120
అంబర్‌పేట్	73473	65121
ముషీరాబాద్	46212	47421
మొత్తం:	328901	280796

ఉపాధి కోర్సులో ఉచిత శిక్షణ

సనత్‌నగర్: టెక్ మహీంద్ర ఫౌండేషన్ డిజిటల్ అకాడమీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యుఎస్) రీస్టార్ట్ కార్యక్రమంలో భాగంగా ఉచిత శిక్షణ, సర్టిఫికేషన్, ప్లేస్‌మెంట్ సహకారాన్ని అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉచిత శిక్షణ పొందేందుకు బీఈ, బీటెక్, బీఎస్సీ కంప్యూటర్స్ (2022-24) సంవత్సరాల్లో పూర్తి చేసిన వారు అర్హులుగా పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రవేశ పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు క్లాక్ టవర్ సమీపంలోని సెబాస్టియన్ రోడ్డులో గల (మెట్రో పిల్లర్ నెంబర్ 941) టెక్ మహీంద్ర క్యాంపస్‌లో సంప్రదించవచ్చన్నారు. వివరాలకు 7337332605 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

యువకుడి ఆత్మహత్య

బన్సీలాల్‌పేట్: మానసిక బాధతో ఓ యువకుడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన మేరకు.. బన్సీలాల్‌పేట్ బండమైసమ్మ నగర్ డబుల్ బెడ్ రూమ్ ప్రాంతానికి చెందిన వంశీక్రిష్ణ(28) సోదరుడు మురళిక్రిష్ణతో కలిసి నివాసముంటున్నాడు. తండ్రి సంవత్సరం క్రితం మృతి చెందడంతో మానసికంగా కుంగిపోయి మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. సోదరుడు మురళీ క్రిష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల(మార్కెట్ స్కూల్)లో గురువారం జనహిత సేవా ట్రస్ట్, భారత్ వికాస్ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత హిమోగ్లోబిన్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 235 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఐరన్,ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ నేటి కాలంలో ప్రధానంగా ఆడపిల్లలు సరైన ఆహారం తీసుకోవడం లేదన్నారు. తద్వారా రక్తహీనత సమస్య తలెత్తుతోందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి రెడ్డి, యూత్ ఫర్ సేవా ప్రతినిధి రామేశ్వర్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింగరావు, టెక్నీషియన్లు సరితారెడ్డి, స్నేహశ్రీ తదితరులున్నారు.

తక్షణమే బోర్డు ఎన్నికలు జరిపించండి



డీజీడీఈకి వినతి పత్రం అందజేస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో ప్రజాప్రాతినిధ్యం కల్పించేందుకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి, డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టర్ జనరల్ (డీజీడీఈ) రాజేశ్వరన్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో డీజీడీఈని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ 2015 జనవరిలో చివరిసారిగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరిగాయన్నారు. 2020లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఏడాది పాటు బోర్డు పదవీకాలాన్ని పొడిగించారని అన్నారు. నాలుగేళ్లుగా వేరీడ్ బోర్డు ఆధ్వర్యంలోనే పాలన సాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం ఎంతమాత్రం సరికాదన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే బోర్డు ఎన్నికలు నిర్వహించి, కంటోన్మెంట్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని డీజీని కోరామన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి



అయ్యప్ప మహాపడిపూజకు హాజరైన ఎమ్మెల్యే పద్మారావు, కార్పొరేటర్లు

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

చిలకలగూడ: ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ సూచించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ గురుస్వామి ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో గురువారం నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజకు కార్పొరేటర్లతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతతో ప్రశాంతమైన, సంతోషకరమైన జీవనం సొంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, బీఆర్ఎస్ నాయకులు రామేశ్వర్‌గౌడ్, త్రినేత్రగౌడ్, కరాటే రాజు, కంది నారాయణ హాజరయ్యారు.

కోర్టు చెప్పినా కంటోన్మెంట్‌కు నిధులివ్వరా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కంటోన్మెంట్: కోర్టుకు వెళ్తే తప్ప కంటోన్మెంట్‌కు ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ ట్యాక్స్ (టీపీటీ) నిధులు విడుదల చేయకపోవడం దారుణమని కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. గురువారం మహేంద్రా హిల్స్‌లోని తన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు చెల్లించాల్సిన టీపీటీ బకాయిలు సుమారు రూ.40 కోట్లు తక్షణమే విడుదల చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. గతంలోనూ టీపీటీ బకాయిలు రూ.100 కోట్లకు చేరడంతో కోర్టును ఆశ్రయించగా, రూ.80 కోట్ల వరకు రాబట్టామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక మళ్లీ బకాయిలు రూ.40 కోట్లకు చేరాయన్నారు. దీంతో మరోసారి తాను హైకోర్టు లో రాష్ట్ర ప్రభుత్వంపై కేసు వేయగా, మూడు నెలలుగా వాదనలు కొనసాగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వద్ద డబ్బులు లేవని మళ్ళీ కేసు వాయిదా వేయాలని ప్రభుత్వం తరఫున లాయర్ కోర్టును కోరగా కేసు పూర్వాపరాలు పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పు వెలువరించారన్నారు. ఎంపీగా కంటోన్మెంట్ నుంచి ప్రాతినిధ్యం వహించిన రేవంత్ రెడ్డి, ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా కూడా కంటోన్మెంట్ అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. రేవంత్ రెడ్డి తొందరపాటు చర్యలతో అనేక తప్పులు చేస్తున్నారని, కంటోన్మెంట్ ఎన్నికల ప్రచారంలో ఆయన అనేక హామీలు ఇచ్చారు, కానీ ఈ ప్రాంత అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదని కనీసం తాగునీరు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదకర విద్యుత్ తీగలు తొలగించండి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను తొలగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ కోరారు. ఇందిరానగర్‌లో గురువారం పర్యటించిన అనంతరం ఈమేరకు బీజేపీ నాయకులు విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రవిప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం ఇందిరానగర్ ప్రధాన రహదారిలోని బ్యాంక్‌ఆఫ్‌బరోడా ముందున్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో విద్యుత్‌తీగలు ప్రమాదకరంగా పరిణమించాయన్నారు. వారాసిగూడ ప్రాంత ప్రజల పట్ల ప్రమాదకరంగా పరిణమించిన విద్యుత్‌తీగలను తొలగించి ప్రమాదకర సమస్యను పరిష్కరించాలని కోరారు. విద్యుత్‌శాఖ ఏడీఈ మహేశ్, ఏఈ శ్రీకాంత్‌లు ఇందిరానగర్‌లో పర్యటించి ప్రమాదకర పరిస్థితులను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, కిట్టు, సత్తిరెడ్డి, బట్టల శ్రీను పాల్గొన్నారు.

జీఓ 317 స్థానికత అంశాన్ని పరిష్కరించాలి

లాలాపేట: స్థానికత అంశం జీఓ 317 సమస్యను రాష్ట్ర పరిధిలోనే పరిష్కరించాలని జీఓ 317 జెపిసి నాయకులు అంటున్నారు. ఈ మేరకు గురువారం జేఏసీ నాయకులు విజయ్ కుమార్, నాగేశ్వర్‌రావు, సందీప్, మధుసూదన్ చారీ, చాముండేశ్వరీ, వినోద, హారతి తదితరులు మాట్లాడారు. గత 3 సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పడుతున్న వేదనను, కష్టాలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర పరిధిలోనే స్థానికత అంశాన్ని పరిష్కరించాలనే విషయంపై శాసన మండలిలో తమ సమస్యను ప్రస్తావిస్తూ పలు సూచనలు, సలహాలు చేసిన ఎమ్మెల్సీ ఎవిఎన్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న, ప్రొ. కోదండరాం, జీవన్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

సెల్ టవర్ తొలగించాలంటూ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న ఎస్ఆర్‌టీ కాలనీ నివాసితులు

సనత్‌నగర్: ఎస్ఆర్‌టీ కాలనీలో ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను తొలగించాలంటూ గురువారం స్థానికులు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. సెల్‌టవర్ కారణంగా రేడియేషన్ ప్రభావంతో స్థానికులు ఆరోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని వాపోయారు. స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మీ భర్త, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాయం ముందు ఆందోళన చేస్తున్న ఏఎన్‌ఎంలు

రాంగోపాల్‌పేట్: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలంటూ ప్యాట్నీ సెంటర్‌లోని 48 గంటలు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం ముందు వంటవార్పుతో పాటు అక్కడ నిద్రించారు. వైద్య ఆరోగ్యశాఖలోని రెండవ ఏఎన్ఎంలు, ఈసీఎస్‌ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్, ఏఎన్‌ఎంలు, వైద్య విధాన పరిషత్, హెచ్‌ఆర్డీ ఇతర అన్ని రకాల ఏఎన్‌ఎంలు గురువారం ఉదయం నుంచి ఆందోళన చేసి అక్కడ నిద్రించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వైద్య ఆరోగ్య సంఘాల పోరాట సమితి నాయకురాళ్లు శీల, సరిత, సులోచన తదితరులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా వివిధ స్కీముల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు పోటీ పరీక్షలు రాసే పరిస్థితి లేదన్నారు. వీరిలో చాలా మంది 46 నుంచి 50 ఏళ్ల పైబడిన వారున్నారని వారిని ఇప్పటికిప్పుడు పరీక్షలు రాయమంటే ఎలా రాస్తారని ప్రశ్నించారు. దశాబ్దాల నుంచి ఎలాంటి రాత పరీక్ష లేకుండా వీరి సర్వీసుల క్రమబద్ధీకరణ కోసం చేసిన పోరాటాలు, సమ్మెలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖలోని ముగ్గురు అధికారులతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు.

ఘనంగా కొరివి కృష్ణస్వామి వర్ధంతి



నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘ నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న బండ ప్రకాశ్

చిలకలగూడ: ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ నగర ప్రథమ మేయర్, సంఘ సంస్కర్త కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ వర్ధంతి వేడుకలు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వారాసిగూడ శివాజీ విగ్రహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. కృష్ణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర అభివృద్ధికి కృష్ణస్వామి అనేక విధాలుగా కృషి చేశారని, ఆయన హయాంలోనే మహానగర్ మాస్టర్‌ప్లాన్ రూపొందించారని వివరించారు. కార్యక్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ ముదిరాజ్, బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ముదిరాజ్, సంఘ నాయకులు యాదగిరి, నగేష్, గణేష, అశోక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్: కృష్ణ స్వామి ముదిరాజ్ జయంతి, వర్ధంతి వేడుకలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షులు పిట్ల నాగేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జూబ్లీబస్‌స్టేషన్ ఆవరణలోని కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ, వేణుగోపాల్ ముదిరాజ్, అశోక్ ముదిరాజ్ పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై దళిత సంఘాల ఆగ్రహం



అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద నున్న అంబేడ్కర్ విగ్రహానికి షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అమిత్ షా అన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని దళిత వర్గాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీఆర్పీ నాయకులు ఎస్. నర్సింహ్మారావు, మహేందర్ పాల్గొన్నారు.

ఓయూను రాజకీయ వేదికగా మార్చారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూను రాజకీయా పార్టీలకు వేదికగా మార్చడం సిగ్గుచేటు అని ఏబీవీపీ అధ్యక్షులు చెలిమెల దృహన్ గురువారం ధ్వజమెత్తారు. ఈ నెల 18న తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కృతజ్ఞత సభ రాజకీయ నిరుద్యోగులకు వారి స్వలాభం నిర్వహించారని విమర్శించారు. కృతజ్ఞత సభతో విద్యార్థులకు ఎలాంటి లాభం లేదన్నారు. అధికార పార్టీకి సంబంధించిన విద్యార్థి నేతలు విస్మరిస్తున్నారని విమర్శించారు.

మోండా మార్కెట్ ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్ ఆక్రమణలను గురువారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉప శంకర్, ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసులు ఆక్రమణలను తొలగించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగే తోపుడు బండ్లు, బండ్ల వ్యాపారులు, ఇతరత్రా చిరు వ్యాపారులను తొలగించారు. ఓల్డ్ జైలు నుంచి మోండా మార్కెట్ రోడ్డు, మారుతీ వీధి, పాత గాంధీ ఆసుపత్రి, పాలికా బజార్ ప్రాంతాల్లోని ఫుట్‌పాత్ ఆ క్రమణలను పోలీ సులు తొలగించారు.

IN THE COURT OF THE HON'BLE III SENIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT SEC'BAD
O.S.No. 356 of 2018

Between:
Canara Bank, Begumpet Branch, Sec'bad ... Plaintiff
And
Sri Varikuppala Chandraiah ... Defendant

To
Sri Varikuppala Chandrarah S/o. V.Venkaiah, aged about 56 years, Occ: Business, R/o. D.No.1-10-263/4, Brahmanawada, Begumpet, Hyderabad (Sec-bad)-500016.

Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of Rs. 4,50,253/- together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **30th December, 2024,** at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
Sd/- N.VENUGOPALA RAO, ADVOCATE
1-2-234/2/1, Plot No.2/P, Road No.4, SRL Colony, Kothapet, Hyd.
Ph: 9849264568